


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | గురువారం 09, జులై 2026 | సంపుటి :1 సంచిక : 187 | పేజీలు : 8 , వెల.2.00



ఎన్నికల విజయంపై

## న్యాయపోరు.. సీఎం విజయ్‌కు కొత్త చిక్కులు

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత సి.జోసెఫ్ విజయ్‌కు మరో కొత్త సవాలు ఎదురైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీవీకే విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే గెలుపును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ మేరకు స్పందించింది న్యాయస్థానం. సీఎం విజయ్, కేంద్ర ఎన్నికల సంఘం మూడు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది.

2



ఇరాన్‌తో కాల్పుల విరమణ

## ఒప్పందం 'టైమ్ వేస్ట్': డొనాల్డ్ ట్రంప్

ఇరాన్‌తో కుదుర్చుకున్న తాత్కాలిక అవగాహన ఒప్పందం కథ ముగిసి పోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే.. ప్రస్తుతానికి చర్చలు కొనసాగించడానికి మాత్రం అనుమతిస్తానని ఆయన పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడిందన్న ఆరోపణలతో.. ఇరాన్‌కు చెందిన రేవు పట్టణాలైన బందర్ అబ్బాస్, సిరిక్, అలాగే కెస్మ్ ద్వీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా భారీ వైమానిక దాడులు జరిపిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది.

2



కుండపోత వర్షాలు.. పుణేలో

## కూలిన మూడు అంతస్తుల భవనం..

మహారాష్ట్రను ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణేలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడు అంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది.



తెలంగాణలో రూ.300 కోట్ల

# గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..

ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి

### సీఎం రేవంత్‌తో కీలక భేటీ

2 లో..



**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి ఈరోజు (బుధవారం) కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి.**

తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది.

'కొత్త కేటాయింపు కాదు'..

## తాడిచర్ల కోల్ బ్లాక్ కేటాయింపుపై భట్టి క్లారిటీ



2

సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటి అని ప్రశ్నించారు.



## తెలంగాణలో కేంద్రమంత్రి జేపీ నడ్డా పర్యటన.. పూర్తి షెడ్యూల్ ఇదే..

వార్త 2లో

ఆ ఒప్పందం బయటపెడితే

## రాజీనామాకు సిద్ధం.. సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈరోజు (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. సీఎం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్‌ఏ(చీణూూ) సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు.




2

విద్యార్థుల వేడి నీళ్ల స్నానాల కోసం సోలార్

## ప్లాంట్ మంజూరు చేస్తాం: పొన్నం

**బిజినిపల్లి:**

నాగర్ కర్నూల్ జిల్లా బిజినిపల్లి మండలం ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన పాఠ్యాంశాల పై ఆరా తీశామని, విద్యార్థుల సమస్యల పై అడిగి తెలుసుకున్నామని, విద్యార్థులు స్నానాలు చేయడానికి వేడి నీరు రావడానికి సోలార్ ప్లాంట్ మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించడం జరిగిందని, విద్యార్థులకు అందుతున్న మెనూ అందుతున్న భోజన వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. స్టోర్ రూమ్ లో వంట సరుకుల నాణ్యత పరిశీలించడం జరిగిందని, వంటకగది లో వండిన ఆహార పదార్థాలతో పాటు కూరగాయలు పరిశీలించామని, తాజా కూరగాయలు వంటల్లో ఉపయోగించాలని సిబ్బందికి మంత్రి పొన్నం సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు పాల్గొన్నారు.



2

## బద్రీనాథ్ విరాళాల చోరీ వివాదం.. ఆలయ సిబ్బందిపై వేటు..

బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకలపై దర్యాప్తు చేయడానికి శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచే ఈ కమిటీ దర్యాప్తును మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలోనే శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపులు కమిటీ ఓ సిబ్బందిపై వేటు వేసింది.



# తెలంగాణలో రూ.300 కోట్ల గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..

## ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి

## సీఎం రేవంత్‌తో కీలక భేటీ

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్(కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి ఈరోజు (బుధవారం) కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.



# ఎన్నికల విజయంపై న్యాయపోరు.. సీఎం విజయ్‌కు కొత్త చిక్కులు

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత సి.జోసెఫ్ విజయ్‌కు మరో కొత్త సవాలు ఎదురైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీవీకే విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే గెలుపును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ మేరకు స్పందించింది న్యాయస్థానం. సీఎం విజయ్, కేంద్ర ఎన్నికల సంఘం మూడు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది. అలాగే సదరు పిటిషన్లపై కొన్ని ప్రక్రియాపరమైన అంశాలనూ లేవనెత్తుతూ, వాటిని సరిదిద్దుకోవాలని జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ ధర్మాసనం సూచించింది. పెరంబూర్‌లో విజయ్ చేతిలో ఓడిన డీఎంకేకు చెందిన ఆర్‌డీ.శేఖర్, అదే నియోజకవర్గానికి చెందిన దినేశ్, లక్ష్మీనరసింహన్ అనే మరో ఇద్దరు ఓటర్లతో కలిసి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తిరుచ్చి ఈస్ట్ ఫలితాన్ని సవాల్ చేస్తూ డీఎంకేకు చెందిన ఎస్.ఇనిగో ఇరుదయరాజ్ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. విజయ్ ఎన్నికల ప్రచారంలో చిన్నారులను భావోద్వేగపూరితంగా ఉద్దేశించి, వారి ద్వారా కుటుంబ సభ్యుల ఓట్లను ప్రభావితం చేసేలా ప్రసంగించారని ఆరోపించారు. ఇది ఎన్నికల ప్రచారంలో చిన్నారులను వినియోగించరాదన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు. సాక్ష్యంగా చెన్నైలోని వైఎంసీఏ మైదానంలో ఏప్రిల్ 21న విజయ్ ప్రచార ప్రసంగానికి సంబంధించిన వీడియోలను సమర్పించారు. అదేవిధంగా ప్రచార గీతాల రూపకల్పనకు సంబంధించిన ఖర్చులను ఎన్నికల వ్యయాల్లో చూపలేదని, ఆస్తుల అఫిడవిట్‌లో ఆదాయపు పన్ను బకాయిల వివరాల్లోనూ వ్యత్యాసాలున్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అలాగే ఏప్రిల్ 19న సెయింట్ ఆంటోనీ చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న అంశాన్నీ ప్రస్తావించారు.మరోవైపు.. విల్లివాక్కం ఎమ్మెల్యే, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఆధవ్ అర్జున్ ఎన్నికల విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పైనా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అలాగే తిరువణ్ణామలై ఎమ్మెల్యే ఈవీ.వేలు, టీవీకేలో చేరిన మాజీ డీఎంకే ఎమ్మెల్యే ఎస్.జయకుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యే తరగై కుత్‌బర్ట్ ఎన్నికల విజయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా న్యాయస్థానం వారికి నోటీసులు పంపింది. కొందరు ప్రతివాదులు జులై 21లోపు తమ సమాధానాల్ని తెలపాలని ఆదేశించింది.

# ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం 'టైమ్ వేస్ట్': డొనాల్డ్ ట్రంప్

అంకారా, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఇరాన్‌తో కుదుర్చుకున్న తాత్కాలిక అవగాహన ఒప్పందం కథ ముగిసి పోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే.. ప్రస్తుతానికి చర్చలు కొనసాగించడానికి మాత్రం అనుమతిస్తానని ఆయన పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడిందన్న ఆరోపణలతో.. ఇరాన్‌కు చెందిన రేవు పట్టణాలైన బందర్ అబ్బాస్, సిరిక్, అలాగే కెస్మ్ ద్వీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా భారీ వైమానిక దాడులు జరిపిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. మరోవైపు.. ఇరాన్ చమురు విక్రయాలకు సంబంధించి గతంలో ఇచ్చిన మినహాయింపు లైసెన్స్‌ను కూడా వాషింగ్టన్ రద్దు చేసింది. దీనికి ప్రతిచర్యగా బహ్రెయిన్, కువైట్‌లలోని అమెరికా లక్ష్యాలపై ఇరాన్ ఎదురుదాడులకు దిగింది.

### ట్రంప్ ఏమన్నారంటే?

టర్కీ రాజధాని అంకారాలో జరుగుతున్న రెండు రోజుల నాటో(చీూజూ) సదస్సు సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. కాల్పుల విరమణ స్థితిపై స్పందిస్తూ.. 'నా దృష్టిలో అయితే అంతా అయిపోయింది. ఇకపై వారితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవాలని నేను అనుకోవడం లేదు. వారితో చర్చలు జరపడం కాలయాపన మాత్రమే. వారు నీచులు. నీచులు అంటే ఏంటో మీకు తెలుసా? మానసిక రోగులు. వారిని నడిపించే నాయకులు కూడా మానసిక రోగులే. వారు అత్యంత క్రూరులు, హింసాత్మక ప్రవృత్తి గలవారు. వారి చేతికి గనుక అణ్వాయుధం చిక్కితే, వారు కచ్చితంగా దానిని వాడేస్తారు. అందుకే నా పరంగా ఈ ఒప్పందం ముగిసిపోయింది' అని ట్రంప్ అన్నారు.అమెరికా ప్రతినిధులు ఇరాన్‌తో చర్చలు కొనసాగించవచ్చని, అయితే దానివల్ల ఎలాంటి ఫలితం ఉంటుందనే దానిపై తనకు నమ్మకం లేదన్నారు. 'వారు మాట్లాడుకుంటే మాట్లాడుకోవచ్చు, కానీ వారు తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని నేను భావిస్తున్నాను' అని ట్రంప్ స్పష్టం చేశారు.

# కుండపోత వర్షాలు.. పుణేలో కూలిన మూడు అంతస్తుల భవనం..

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

మహారాష్ట్రను ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణేలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడు అంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ (ృాజవీజ) వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది.అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించారు.



# 'కొత్త కేటాయింపు కాదు'.. తాడిచర్ల కోల్ బ్లాక్ కేటాయింపుపై భట్టి క్లారిటీ

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటి అని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్(వీవీదీ=) యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు.కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

# తెలంగాణలో కేంద్రమంత్రి జేపీ నడ్డా పర్యటన.. పూర్తి షెడ్యూల్ ఇదే..

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా రేపు (గురువారం) తెలంగాణలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. రేపు ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీనగర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు.రేపు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌నకు వెళ్లనున్నారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.



# ఆ ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం.. సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. సీఎం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్‌ఏ(చీఱూూ) సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోయాయని, దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు.

### అబద్ధాల్లో రేవంత్‌ను మించినవారు లేరు..

కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్ధానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్ధాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్ధాలు చెప్పారని.. అనుమతులుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు.

### సీఎం రేవంత్‌కు సవాల్

'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

# బద్రీనాథ్ విరాళాల చోరీ వివాదం.. ఆలయ సిబ్బందిపై వేటు..

ఇంటర్‌నెట్ డెస్క్:

బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకలపై దర్యాప్తు చేయడానికి శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచే ఈ కమిటీ దర్యాప్తును మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలోనే శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపులు కమిటీ ఓ సిబ్బందిపై వేటు వేసింది. విరాళాలు చోరీ చేశాడన్న ఆరోపణల కారణంగా అతడిని విధుల నుంచి సస్పెండ్ చేసింది.దీనిపై బీకేటీసీ చైర్మన్ హేమంత్ ద్వివేది స్పందిస్తూ.. 'ప్రైవేట్ సెక్రటరీగా పని చేసే ప్రమోద్ నౌతియాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశాం. ప్రాథమిక దర్యాప్తులో విరాళాల విషయంలో అతడు అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది' అని పేర్కొన్నారు. ఇక, సస్పెండ్ అయిన ప్రమోద్ నౌతియాల్‌పై మంగళవారం రాత్రి బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదైంది. అతనిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 306, 316(5) కింద కేసులు నమోదు అయ్యాయి.

### శరావేగంగా గవర్నమెంట్ కమిటీ దర్యాప్తు..

ఆలయ విరాళాల వివాదంపై మరో వైపు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటైంది. ఈ హై-లెవల్ కమిటీకి గర్వాల్ డివిజనల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ నాయకత్వం వహిస్తున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తివారీ, మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఫైనాన్స్ డైరెక్టర్ జగత్ సింగ్ చౌహాన్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. బద్రీనాథ్ ఆలయ విరాళాలు, కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు.

# సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం : సీఎం

### కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల్ని ప్రారంభించిన సీఎం

### డ్రగ్స్, గంజాయిపై మరింత కఠినంగా ఉండాలని పోలీసులకు ఆదేశం

### పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన సీఎం చంద్రబాబు



**కుప్పం,**

సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ నుంచి ఆస్పత్రి పరిశుభ్రత వరకు ప్రతీ అంశంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటన రెండో రోజు కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించి సేవలను పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు, వైద్యారోగ్య రంగంలోని ఆవిష్కరణలు, డ్రగ్స్ నివారణ చర్యలపై అధికారులతో మాట్లాడారు. డిజిటలైజేషన్ తో పాటు డేటా ఇంటిగ్రేషన్ అవసరంకుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజుకు ఎంత మందికి సేవలు అందించగలరని సీఎం ప్రశ్నించారు. రోజుకు 30?40 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆస్పత్రిని పరిశీలన సందర్భంగా ఆవరణలో కొంత మేర చెత్త కనిపించడంపై ప్రశ్నించిన ముఖ్యమంత్రి, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే ముఖ్యమని పేర్కొన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచించారు. డయాలసిస్ వార్డును సందర్శించిన సందర్భంగా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు వివరించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని, కుప్పంలో ప్రజలకు ఏ మేరకు మేలు కలిగిందో వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.గంజాయి నియంత్రణపై కఠిన చర్యలుపంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబు అక్కడ మొక్క నాటారు. వైద్యారోగ్య రంగంలో వివిధ ఆవిష్కరణలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులకు తక్షణ సమాచారం అందించేలా ఓ పరికరం రూపొందించిన విద్యార్థిని సీఎం అభినందించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డవారికి మెడిటేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగయ్యేందుకు సహకారం అందిస్తున్నట్టు బ్రహ్మకుమారీలు వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కుప్పం నగరంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం?స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖమంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మతాల మధ్య చిచ్చుకు వైసిపి యత్నం

### హిందువులపై విషం చిమ్ముతున్న ప్రశ్న రావణ్, ప్రకాశ్ రాజ్,జడ శ్రవణ్

### వీరందరికి మద్దతుగా నిలుస్తున్న వైసిపి నేతలు

### మబండిపడ్డ ఏపి సాధుపరిశత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద

**విశాఖపట్నం,**

మతాల మధ్య చిచ్చుపెట్టాలని వైసీపీ చూస్తోందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. ప్రశ్న రావణ్, జడ శ్రవణ్ కుమార్, ప్రకాశ్ రాజ్.. ప్రతిరోజూ హిందువులపై విషాన్ని చిమ్ముతున్నారని మండిపడ్డారు. హిందూ వ్యతిరేకంగా ఉన్నవారందరికీ వైసీపీ న్యాయ సహాయం చేస్తోందన్నారు. మంగళవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల పేర్లు పెట్టుకుని సనాతన ధర్మాన్ని కించపరిచేలా నటుడు ప్రకాశ్ రాజ్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల ఆరాధ్య దైవాలను కించపరిచే హక్కు ఎవరిచ్చారని స్వామిజీ ప్రశ్నించారు. ప్రభుత్వం.. తప్పులు చేస్తున్న వారిని చట్టప్రకారం అరెస్టు చేస్తుంటే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన తప్పులను ఎత్తి చూపినందుకే తమను టా÷-గ్గ్ఁ÷ట్ చేశారన్నారు. హిందూ మనోభావాలను దెబ్బతీస్తూ చేస్తున్న వ్యాఖ్యల వెనుక వైసీపీ కుట్ర ఉందని స్వామి శ్రీనివాసానంద ఆరోపించారు. తమిళనాడు సీఎం విజయ్‌పై స్వామి శ్రీనివాసానంద సరస్వతి ప్రశంసలు కురిపించారు. హిందూ ఆలయాల నుంచి వచ్చే నిధులను ఆలయాల అభివృద్ధి కోసమే వాడుతామని తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. విజయ్ నిర్ణయాన్ని తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. హిందూ ఆలయాల నిధులను ఇతర అవసరాల కోసం మళ్లించకూడదని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సీఎంలు కూడా తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయమే తీసుకోవాలని స్వామిజీ కోరారు. ప్లాన్ ప్రకారమే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై దాడులు చేస్తున్నారని హిందూ సంఘాల నేత తురగా శ్రీరామ్ అన్నారు. ఏపీలో రిజర్వేషన్ల జిహాద్ జరుగుతోందని ఆరోపించారు. రిజర్వేషన్లను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్లు లాక్కునేవారి వెనుక నాయకులు ఉన్నారని వ్యాఖ్యానించారు. కొంతమంది యూట్యూబర్, జర్నలిస్టుల ముసుగులో హిందుత్వంపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్న రావణ్‌కు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మద్దతు ఇస్తున్నారంటే అర్థం ఏంటి అని శ్రీరామ్ ప్రశ్నించారు.

## దక్షిణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

### వివిధ కంపెనీలతో పెట్టుబడులపై విస్తృతంగా చర్చలు

### హ్యుందాయ్, మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ

**అమరావతి,**

:ఏపీకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా దక్షిణ కొరియాలో మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.హ్యుందాయ్ మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో హ్యుందాయ్ మోబిస్ ఆర్ అండ్ డీ/ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి,అనంతపురం ప్రాంతంలో ఈవీ కాంపోనెంట్స్, బ్యాటరీ సిస్టమ్స్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. ఐఐటీ తిరుపతితో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అటానమస్ డ్రైవింగ్, ఆడాస్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశోధనలకు హ్యుందాయ్ మోబిస్‌తో లోకేశ్ భాగస్వామ్యం కోరారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని హ్యుందాయ్ మోబిస్‌కు వినతి చేశారు. టైర్-1 ఆటోమొబైల్ సరఫరాదారుల సమావేశాన్ని ఏపీలో నిర్వహించాలని ప్రతిపాదించారు. హ్యుందాయ్ మోబిస్ విస్తరణకు ఏపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. అనంతపురం యూనిట్‌లో హ్యుందాయ్, కియా కోసం కీలక మాడ్యూల్స్ తయారు చేయనున్నట్లు హ్యుందాయ్ మోబిస్ తెలిపింది. ఏపీ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి లోకేశ్ సమావేశ మయ్యారు. ఓఎస్ఏటి సెమీకండక్టర్ నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఏపిలో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని అపాక్ట్‌కు ప్రతిపాదన చేశారు. ఇతర ఓఎస్ఏటి కంపెనీలను ఏపీకి తీసుకురావాలని అపాక్ట్‌ను కోరారు. హనా మైక్రాన్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి చెప్పారు. విశాఖ ప్రాజెక్టు ఏపీకి ప్రతిష్ఠాత్మక విజయమని.. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని అపాక్ట్ సీఈవో వెల్లడించారు. విశాఖలో యూనిట్ నిర్మాణం త్వరలో ప్రారంభంకానుంది. రూ.468 కోట్ల పెట్టుబడితో విశాఖలో సెమీకండక్టర్ యూనిట్ రానుంది. ఏడాదికి 9.6 కోట్ల పరికరాల తయారీ లక్ష్యంతో విశాఖ యూనిట్ పనిచేయనుంది.

## వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

### నిర్ణీత సమయానికి జిఎంఆర్ సంస్థ నిర్మాణాలు

### ప్రధాని చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

### పనులపై సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయనగరం,**

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది మెరుగుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎంఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని అన్నారు. ఆ ఆదేశాలు మేరకు అనుకున్న సమయానికే జీఎంఆర్ సంస్థ ఎయిర్‌పోర్టును నిర్మించిందని చెప్పారు. ఎయిరో డ్రో లైసెన్స్ కూడా వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన వారం తర్వాత ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. మోదీ షెడ్యూల్ ఖరారైన తర్వాత తేదీ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భోగాపురానికి తరలిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో 4 కోట్ల మంది ప్రయాణించే విధంగా టెర్మినల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 78,000 చదరపు మీటర్ల మేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు.. దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా ఉందని కితాబిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర కళలు, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేపట్టినట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

### రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అట్లూరి ప్రసన్న

**విజయవాడ,**

ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థిని అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అట్లూరి ప్రసన్న.. న్యూయార్క్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆమె తన స్నేహితులతో కలిసి కారులో సమీపంలోని గుడికి వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వీరి కారును మరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసన్నతో పాటు మరో అమ్మాయి ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలవ్వగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రసన్న స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామం. ఇటీవలే పేస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా.. ఇలా రోడ్డు ప్రమాదంలో కన్నుమూయడంతో ఆమె కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి నెట్‌జీరో విధానం

### కుప్పం అంతటా అమలుకు సీఎం ఆదేశం

### నెట్‌జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సీఎం పరిశీలన

**కుప్పం,**

నెట్‌జీరో విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న నలగంపల్లి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కుప్పం పర్యటన రెండో రోజు శనివారం నలగంపల్లిలోని నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి....సోలార్ రూఫ్‌టాప్ సోలార్, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించారు. నలగంపల్లి నమూనాను కేస్ స్టడీగా తీసుకుని కుప్పం వ్యాప్తంగా నెట్‌జీరో విధానాన్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు.సర్క్యులర్ ఎకానమీని గ్రామస్థాయిలో అమలు గ్రామంలోని ఓ ఇంటిని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సోలార్ ప్యానెళ్ల సంఖ్య, విద్యుత్ ఉత్పత్తి, ఇంటి అవసరాలకు సరిపోతుందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్‌లను ఉపయోగిస్తూ నెలకు సుమారు రూ.400 వరకు ఆదా చేస్తున్నామని లబ్ధిదారులు వివరించారు. వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్ట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ, కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్ నిర్వహణను కూడా సీఎం పరిశీలించారు. నెట్‌జీరో విధానంలో భాగంగా ఈవీ వాహనాల వినియోగాన్ని కూడా చేర్చాలని ముఖ్యమంత్రి సూచించారు. సర్క్యులర్ ఎకానమీని గ్రామస్థాయిలో అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నలగంపల్లి అనుసరిస్తున్న విధానం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.ఇండక్షన్‌తో భద్రత ఇండక్షన్ స్టవ్‌లతో ప్రస్తుతం అన్ని రకాల వంటలు చేసుకునే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్యాస్ లీకేజీ ప్రమాదాలు తగ్గడంతో పాటు భద్రత పెరుగుతుందని గ్రామస్థులు సీఎంకు వివరించారు. కుప్పంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ విస్తరణ ద్వారా 7,489 మంది ఎస్సీ, ఎస్టీలు, 39,215 మంది బీసీలు, 7,381 మంది ఓసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపడుతున్నట్లు సీఎంకు అధికారులు వివరించారు. ఈ విధానాన్ని కుప్పం అంతటా విస్తరించి ప్రజల విద్యుత్ వ్యయాన్ని తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## ఎపి అభివృద్ధికి ఇతోధికంగా చేయూత

### వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

**విజయవాడ,**

కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయీ పార్కులో స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచీ రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అబివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

## యోగా మన జీవితంలో భాగం కావాలి

### కృష్ణా తీరంలో పెద్ద ఎత్తున యోగాంధ్ర

### 21న యోగా దినోత్సవ విజయం చేయాలన్న కలెక్టర్

**విజయవాడ,**

రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అంతా కలిసి యోగాసనాలు వేస్తున్నారు. మంగళవారం ఉదయం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో బరమ్ పార్కులోని కృష్ణా నదీ తీరాన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' కోసం అందరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. శరీరాన్ని ఎంత ఆరోగ్యంగా ఉంచుకుంటే, మనం చేసే పనిలో అంతటి అంకితభావం ఉంటుందని తెలిపారు. వికసిత్ భారత్, విజన్ ఆంధ్రప్రదేశ్ 2047 వంటి లక్ష్యాలను సాధించాలంటే పౌరులందరూ ఆరోగ్యంగా ఉండటం అవసరమన్నారు. ఈ యోగాసనాలు సరళంగా ఉండి ప్రతి ఒక్కరూ సులభంగా ప్రాక్టీస్ చేసేలా ఉంటాయని కలెక్టర్ వెల్లడించారు. రోజుకు 45 నిమిషాల పాటు సమయం కేటాయిస్తే సరిపోతుందని తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ వీఎంసీ స్టేడియం, అంబేద్కర్ కళా వేదికలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఉంటుందని.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలందరూ ఈ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు సహకరించాలని కలెక్టర్ లక్ష్మీ శ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా పామర్రు మొవ్వ మండలం కూచిపూడిలో యోగాంధ్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, అధికార ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూచిపూడి కళాకారులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే సామూహిక యోగాసనాలు వేశారు. విద్యార్థుల యోగా విన్యాసాలు అందిరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. ప్రజలందరూ యోగాపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని... అప్పుడే అనేక వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. యోగా సాధన ద్వారా కలిగే ప్రయోజనాలు అనేకమని, మానసిక చైతన్యం పెరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా బాల్య దశ నుంచే యోగా అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కూచిపూడిలో యోగాంధ్ర వేడుకలు జరగడం సంతోషకరమని ఎమ్మెల్యే కుమార్ రాజా తెలిపారు. 76 ఏళ్ల వయసులో సీఎం చంద్రబాబు ఇంత చురుగ్గా ఉండడానికి కారణం... ఆయన దశాబ్దాలుగా యోగా సాధన చేయడమే అని చెప్పుకొచ్చారు. ప్రకృతి మనకు అందించిన గొప్ప వరం యోగా అని అన్నారు. యోగా చేద్దాం.... ఆరోగ్యంగా జీవిద్దాం అన్నది అందరి నినాదం కావాలని ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు.

## -హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

### దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు

### ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం

### అమరన్‌నాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటి సిఎం

**అమరావతి,**

రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టూబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారిపోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళ్లు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# ఆర్టీసీని లాభాల బాటలోకి తెచ్చాం: మంత్రి పొన్నం

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ. 12 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసులను వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రులు కాసేపు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ పర్యటనలో భాగంగా నూతన జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని సైతం మంత్రులు ప్రారంభించారు. ఆ తర్వాత ఉయ్యాలవాడలోని బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నాగర్‌కర్నూల్ ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఇప్పటివరకు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి సుమారు రూ. 11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేయాల్సి రావడం, పలువురు ఆత్మహత్యలకు పాల్పడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేవలం మూడు రోజుల్లోనే కార్మికుల సమస్యలను పరిష్కరించి, ఆపరేషనల్ నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల దిశగా తీసుకువచ్చామని స్పష్టం చేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలు చేశామని, కారుణ్య నియామకాలతో పాటు కొత్త ఉద్యోగాల భర్తీ, కొత్త బస్సుల కొనుగోలు కూడా వేగంగా కొనసాగుతోందని ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 10 వేల బస్సులు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజాపాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు, కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, అభివృద్ధిని ఏమాత్రం ఆపకుండా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలంతా తప్పనిసరిగా ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రవాణా, పోలీసు శాఖలు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నాయని మంత్రులు ప్రజలకు పిలుపునిచ్చారు.




## సంపాదకీయం...

# ప్రభుత్వ విద్య వికసించేనా?

విద్య సామాన్యుడికి ఒక ఆశయం, బతుకు బాగు చేసే ఒక సాధనం. మధ్య తరగతికి ఒక ఆకాంక్ష, అందీఅందని ద్రాక్ష. ధనవంతులకు మరింత ధనం సంపాదించడానికి ఉపయోగపడే ఆయుధం. ప్రభుత్వ రంగంలో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తుంటే విద్యార్థులు ఎంతో శ్రద్ధగా నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదిగేవారు. ప్రైవేటు రంగంలో అతికొద్ది పాఠశాలలు సేవాభావంతో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దేవి. కొద్దిమంది విద్యాభిమానులు లాభాపేక్ష లేకుండా ప్రైవేటు పాఠశాలలను నడపగా అతికొద్ది మొత్తంలో ఫీజు వసూలు చేస్తూ క్రైస్తవ మిషనరీ సంస్థలు పాఠశాలలను మంచి ప్రమాణాలతో నడిపాయి. ఇది 1990 వరకు పరిస్థితి. కాలక్రమేణా ప్రైవేటు పాఠశాలల సంఖ్య పెరిగింది. ఇంకా కార్పొరేట్ సంస్థలు పెద్ద సంఖ్యలో ఒకేసారి అనేక ప్రదేశాలలో పాఠశాలలు తెరిచి విద్యను వ్యాపారమయం చేశాయి. అదే క్రమంలో ప్రభుత్వం నెమ్మదిగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించకపోవడం కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించడం చేస్తూ విద్యకు చాలా తక్కువ బడ్జెట్ కేటాయింపులు చేయడంతో అవి తమ ప్రభను కోల్పోయాయి. ప్రభుత్వం నెమ్మదిగా తన బాధ్యత నుండి దూరం పోయింది. ప్రభుత్వ పాఠశాలల భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకోగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పెద్దపెద్ద భవనాల్లో నడుస్తుంటే తల్లిదండ్రుల ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది. విద్య క్రమంగా ప్రైవేట్ కార్పొరేట్ చేతుల్లోకి పోయింది. దానికి తోడు ప్రైవేట్ కార్పొరేట్ వ్యవస్థలు ఆంగ్ల మాధ్యమంలో నడుస్తుంటే ప్రభుత్వ బడులను తెలుగు మీడియంలోనే బోధన కొనసాగించడం అవి వెనుకబడి పోవడానికి మరో కారణమైంది. మౌలిక వసతుల కల్పన ముఖ్యంగా భవనాలు, మంచినీరు, టాయిలెట్స్ లేకపోవడం ఇవన్నీ కర్ణుడు చావుకు సవాలక్ష కారణాలు లాగా ప్రభుత్వ స్కూళ్లకు నెమ్మదిగా మరణ శాసనం రాశాయి. ఈ మధ్య వచ్చిన ఆకునూరి మురళి కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 30 రకాల బడులు నడుస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మున్సిపల్, గిరిజన వికాస కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్, పబ్లిక్ స్కూల్ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనూ కస్తూర్బా పాఠశాలలు కేంద్రీయ నవోదయ పాఠశాలలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనూ నడవడం గమనార్హం. ఇక ప్రైవేట్ కార్పొరేట్ రంగాలలో టెక్నో, ఈ–టెక్నో, ఒలింపియాడ్, వరల్డ్, ఇంటర్నేషనల్, ఫౌండేషన్, డిజిటల్, పబ్లిక్ స్కూల్స్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, గ్రామర్ స్కూల్స్ వంటి రకరకాల ఆకర్షణీయమైన పేర్లతో పాఠశాలను నడిపిస్తూ తల్లిదండ్రులను, వారిపిల్లలను ఆకర్షిస్తున్నాయి. ఇన్ని రకాల పాఠశాలల్లోనూ కేవలం ఎస్‌సిఇఆర్‌టి, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ, ఐబి సిలబస్ మాత్రమే బోధిస్తారు. రంగాలలోని పాఠశాలలు శరవేగంతో దూసుకొని దోచుకుంటూ పోతుంటే ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ ఆంగ్ల మాధ్యమం అమలు చేయడానికి సంకోచిస్తున్నది. కనీసం ఆరవ తరగతి నుండైనా ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టవచ్చు. అదే విధంగా కంప్యూటర్ స్కిల్స్ డిజిటల్ లిటరసీ వంటి నైపుణ్యాలు నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. లేదంటే వారు రానున్న కాలంలో ఇతరులతో పోటీ పడలేరు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వెయ్యికి పైగా గురుకులాలలో ఆంగ్ల మాధ్యమంలోనే బోధన జరుగుతున్నది. కంప్యూటర్ విద్య కూడా నేర్పుతున్నారు. కానీ వాటిలో కేవలం ఐదు లక్షల మందికి మాత్రమే విద్య అందుబాటులో ఉన్నది. పైగా నేటి ప్రభుత్వం గురుకులాలను నిర్లక్ష్యం చేయడంతో వాటికి భవనాలు లేక ఆహార నాణ్యత కొరవడి, ఎలుక కాట్లు, పాము కాట్లతో విద్యార్థుల మరణాలతో వాటి పేరు ప్రతిష్టలు దిగజారాయి. ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల పేరుతో ప్రతి నియోజకవర్గానికి ఒకటి మంజూరు చేసి రెండు వందల రూపాయలు కోట్లతో నిర్మాణాలు చేపట్టింది ఆ ప్రాజెక్టు పూర్తయి అది విద్యార్థులకు అందుబాటులోనికి వచ్చేనో రాదో ఎవరికీ తెలియదు. ఒకవేళ మళ్లీ ప్రభుత్వాలు మారితే వాటి భవిష్యత్తు ప్రశ్నార్థకమే.

అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

## ఆట





# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు నేమార్ రిటైర్మెంట్

న్యూజెర్సీ వేదికగా జరిగిన ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 పోరులో నార్వే చేతిలో బ్రెజిల్ 2–1 తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ దారుణ ఓటమి తర్వాత బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు నేమార్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే 34 ఏళ్ల నేమార్ భావోద్వేగానికి గురవుతూ.. తన 16 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు వెల్లడించాడు. 'సెలెకావో' (బ్రెజిల్ జట్టు)తో తన ప్రయాణం ముగిసిందని స్పష్టం చేశాడు. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో నార్వే ఆటగాడు ఎర్లింగ్ హాలాండ్ చివరి నిమిషాల్లో వరుసగా రెండు గోల్స్ చేసి బ్రెజిల్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. స్టాపేజ్ టైమ్‌లో నేమార్ పెనాల్టీని గోల్‌గా మలిచినప్పటికీ బ్రెజిల్‌కు ఓటమి తప్పలేదు. మ్యాచ్ అనంతరం నేమార్ మాట్లాడుతూ.. "నేను ఎంతో ప్రయత్నించాను, కానీ ఇక అంతా ముగిసింది. నేను ఇక్కడే ప్రారంభించాను, ఇక్కడే ముగించాను" అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. గాయంతోనే వరల్డ్ కప్‌కు వచ్చిన నేమార్.. ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు.






# ఇదే నా చివరి ప్రపంచకప్..

## క్రిస్టియానో రొనాల్డో కీలక ప్రకటన

పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై ఒక కీలక ప్రకటన చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంటే తన కెరీర్‌లో చివరిదని ఆయన స్పష్టం చేశాడు. స్పెయిన్‌తో జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన భవిష్యత్తు ప్రణాళికలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. ఈ సందర్భంగా రొనాల్డో మాట్లాడుతూ.. "ఈ ప్రపంచకప్‌ను వీలైనంత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. ఎందుకంటే ఇదే నా చివరి ప్రపంచకప్. అయితే, రేపటి మ్యాచే ఈ టోర్నీలో నా చివరి గేమ్ కాకూడదని ఆశిస్తున్నాను" అన్నాడు. 41 ఏళ్ల రొనాల్డోకు ఇది ఆరో ప్రపంచకప్ కావడం విశేషం. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడి మూడు గోల్స్ సాధించాడు. వీటిలో ఒకటి నాకౌట్ దశలో చేసినదే. తన సుదీర్ఘ కెరీర్‌లో ప్రపంచకప్‌లలో మొత్తం 11 గోల్స్ నమోదు చేశాడు. రిటైర్మెంట్‌పై పదేపదే ప్రశ్నలు అడగవద్దని మీడియాను కోరాడు. "నేను ఎప్పుడు రిటైర్ అవ్వాలనుకుంటే అప్పుడే అవుతాను. మీరు కోరుకున్నప్పుడు కాదు. ఈ ప్రశ్న అడగడం సమయం వృథా. నా దృష్టి మొత్తం రేపటి మ్యాచ్‌పైనే ఉంది" అని స్పష్టం చేశాడు.




# శ్రీలంకపై అన్వయ్ ద్రవిడ్ మెరుపు ఇన్నింగ్స్..

భారత క్రికెట్ దిగ్గజం, 'ది వాల్' రాహుల్ ద్రవిడ్ క్రికెట్ వారసత్వాన్ని ఆయన చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ ఘనంగా ముందుకు తీసుకెళుతున్నాడు. శ్రీలంక అండర్–19 జట్టుతో నేడు జరిగిన రెండో యూత్ వన్డేలో ఈ యువ వికెట్ కీపర్–బ్యాటర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. మహింద రాజపక్స అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కేవలం 67 బంతుల్లోనే 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 19వ ఓవర్ ముగిసేసరికి 81 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్, మరో బ్యాటర్ అర్జున్ రాజ్‌పుత్ (76 పరుగులు) తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 145 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. ముఖ్యంగా అన్వయ్ దూకుడుగా ఆడుతూ కేవలం 47 బంతుల్లోనే తన తొలి యూత్ వన్డే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడు చూసి శతకం ఖాయమనిపించినా, శ్రీలంక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గిమ్హాన్ మెండిస్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు.

## చెరువు కట్టపై పిచ్చి మొక్కల తొలగింపు:





**భీమారం(మంచిర్యాల) అర్జున్ సమాచారం, జూలై 08:**

దాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు కట్ట చుట్టుపక్కల దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని బుధవారం సర్పంచ్ చేగొండ కొమురయ్య ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగించారు. గత కొన్ని రోజులుగా చెరువు కట్టపై పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో, చెరువు కింద సాగవుతున్న పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతుల సమస్యను గుర్తించిన సర్పంచ్ చేగొండ కొమురయ్య ప్రత్యేక చొరవ తీసుకొని ఈ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ) లతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు. దారికి అడ్డుగా ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించి మార్గాన్ని సుగమం చేయడం పట్ల చెరువు కింది పొలాల రైతులు సర్పంచ్‌కు మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కల్వచర్లలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన సమావేశం



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 8:**

రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో బీఎల్‌వోలు, బీఎల్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి, రామగిరి మండల ఆర్.ఐ. కె. మహేష్, గ్రామపంచాయతీ అధికారి తిరుపతమ్మ, బీఎల్‌వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.సమావేశంలో అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడంతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## ఏటీఎంలలో నిండుకుంటున్న నగదు: బ్యాంకులపై ఆర్బీఐ సీరియస్

ఒకప్పుడు బ్యాంకులకు వెళ్లి నగదు తీసుకునే శ్రమను తగ్గించిన ఏటీఎంలు, ఇప్పుడు ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నగరాలు, చిన్న పట్టణాల్లోని ఏటీఎంలలో బ్యాంకులు సరిపడా నగదు ఉంచకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు నెలలుగా ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని చిన్న నగరాల్లో నగదు కొరతపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) తీవ్రంగా స్పందించింది. వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, ఏటీఎంలలో నగదు నింపే బ్యాంకు శాఖల్లోని నగదు నిల్వలపై సమగ్ర నివేదిక సమర్పించాలని బ్యాంకులను ఆదేశించినట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో నగదు కొరత తీవ్రత మరింత స్పష్టంగా కనిపించింది. కొన్ని నగరాల్లోని ఏటీఎంలు వాటి సగటు సామర్థ్యంలో కేవలం 57 నుంచి 64 శాతం మేర మాత్రమే నగదును కలిగి ఉన్నాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ (సీఏటీఎంఐ) గత నెలలో ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కు ఫిర్యాదు చేసింది.ఏటీఎంలలో నింపేందుకు బ్యాంకుల నుంచి సరిపడా నగదు అందకపోవడం వల్ల నగదు నిర్వహణ కంపెనీల వ్యాపారం సైతం తీవ్రంగా దెబ్బతింటోంది. ఈ ఆరోపణలు నిజమని తేలితే బ్యాంకులపై ఆర్బీఐ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.ఏటీఎంలలో నగదు కొరతపై వస్తున్న విమర్శలపై బ్యాంకులు సైతం తమ వాదనను వినిపిస్తున్నాయి. బ్రాంచీలలో ఉన్న నగదు మొత్తాన్ని ఏటీఎంలలో నింపడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కౌంటర్ల ద్వారా వచ్చే కరెన్సీలో చినిగిపోయినవి, చలామణికి పనికిరాని నోట్లు కూడా ఉంటాయని, వాటన్నింటినీ మినహాయిస్తే ఏటీఎంలలో లోడ్ చేయడానికి తగిన నాణ్యమైన కరెన్సీ నిల్వలు బ్రాంచీలలో చాలా తక్కువగా ఉంటున్నాయని వివరిస్తున్నారు. వీటికి తోడు నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోతుండటంతో కొత్తగా ఏటీఎంల సంఖ్యను పెంచడం కూడా తమకు పెను సవాలుగా మారిందని బ్యాంకులు తమ ఇబ్బందులను ఏకరువు పెడుతున్నాయి.




# ఖమ్మం జిల్లాలో మూడు వందల కోట్లతో గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రతినిధుల భేటీ । ఏడు వందల మందికి పైగా ఉపాధి అవకాశాలు । రోడ్డు విస్తరణకు సీఎం ఆదేశం.**

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటు, ఆయిల్ పామ్ సాగు విస్తరణ తదితర కీలక అంశాలపై గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ప్రాంగణంలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో గోద్రేజ్ గ్రూపు సంస్థల కార్పొరేట్ అఫేర్స్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగత నియోగి భేటీ అయ్యారు. రాష్ట్రంలో మొట్ట మొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ సాగు విస్తరణకు సంబంధించిన సమగ్ర నివేదికను ఈ



సందర్భంగా వారు ముఖ్యమంత్రి కి అందజేశారు. ఖమ్మం జిల్లాలో సుమారు మూడు వందల కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏడు వందల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్, నర్సరీ, పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 113.5 ఎకరాల భూమిని కేటాయించింది.ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులో సీడ్ గార్డెన్ విస్తరణ నిమిత్తం అదనంగా మరో 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని గోద్రేజ్ ప్రతినిధులు ఈ భేటీలో ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, ప్రాసెసింగ్ యూనిట్ కు రవాణా సౌలభ్యం కోసం ప్రస్తుతం ఉన్న రహదారిని విస్తరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వారి వినతులపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీజీఐఐసీ ఆధ్వర్యంలో తక్షణమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఈ20 పెట్రోల్‌తో వాహనాలు చెడిపోతాయనడం అవాస్తవం: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు చెడిపోతాయని, వాటి సామర్థ్యం తగ్గుతుందని జరుగుతున్న ప్రచారంపై కేంద్ర రోడ్డు, రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను ఇతర దేశాల్లోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల ఇంజిన్లు పాడవుతున్నాయనే వాదనలో ఏమాత్రం నిజం లేదని,




అన్ని రకాల పరీక్షలు నిశితంగా నిర్వహించిన తర్వాతే ఈ ఇంధనాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చామని వివరించారు. ఈ ఇంధనం వాడి చెడిపోయిన కారు ఒక్కటైనా ఉంటే తనకు చూపించాలని విమర్శకులకు ఆయన సవాల్ విసిరారు. ఇథనాల్ బ్లెండింగ్‌పై కొందరు పనిగట్టుకుని డబ్బులిచ్చి మరీ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. సోషల్ మీడియాలో వస్తున్న ఇటువంటి వదంతులను ప్రజలు నమ్మవద్దని సూచించారు.విదేశాల నుంచి ముడి చమురు దిగుమతులను తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను అరికట్టి పర్యావరణాన్ని కాపాడటం కోసమే ఈ20 ఇంధనాన్ని ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. చెరకు, మొక్కజొన్న, వరి వంటి వ్యవసాయ ఉత్పత్తుల నుంచి ఇథనాల్ తయారవుతోందని వివరించారు. ఇదే సమయంలో తన కుటుంబానికి చెందిన కంపెనీలు ఇథనాల్ ఉత్పత్తి చేస్తున్నాయన్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తమ కుటుంబానికి చక్కెర కర్మాగారాలు ఉన్న మాట వాస్తవమే అయినా, వాటి వ్యాపారం ఇథనాల్ ఉత్పత్తిపై ఎంతమాత్రం ఆధారపడి లేదని కుండబద్దలు కొట్టారు.రవాణా రంగంలో భవిష్యత్తు అంతా హైడ్రోజన్ ఇంధనానిదేనని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల వినియోగాన్ని ప్రజలు అలవాటు చేసుకోవాలని సూచించారు. స్వయంగా తాను ఎలక్ట్రిక్, ఫ్లెక్స్ ఫ్యూయల్, హైడ్రోజన్ వాహనాలను వినియోగిస్తున్నానని, ఆసక్తి ఉన్నవారు తన ఇంటికి వచ్చి ఆ మూడు కార్లలో ప్రయాణించి చూడొచ్చని ఆహ్వానించారు. ముఖ్యంగా తాను ప్రయాణించే హైడ్రోజన్ కారు మెర్సిడెస్ బెంజ్ కంటే మెరుగైన అనుభూతిని ఇస్తుందని, ఆ సరికొత్త సాంకేతికతపై తనకు పూర్తి నమ్మకం ఉందని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.

## కోర్టు స్టే ఉన్నా ఆగని అక్రమ నిర్మాణాలు: హైడ్రా కమిషనర్

గచ్చిబౌలి జంక్షన్‌లోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో కోర్టు స్టే ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ వ్యవహారంపై స్థానిక ప్లాట్ల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజన బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి లేఅవుట్‌లోని రహదారులు, పార్కుల ఆనవాళ్లు లేకుండా



తవ్వకాలు చేపట్టడం, మట్టి పోయడం తదితర పనులను ముమ్మరంగా నిర్వహిస్తుండటాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోకి వచ్చే ఈ రహదారులు, పార్కుల హద్దులను వెంటనే నిర్ధారించి వాటిని సంరక్షిస్తామని ప్లాట్ యజమానులకు వారు స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించిన సంధ్యా శ్రీధర్ రావుపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 1980వ దశకంలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో 162 ప్లాట్లతో ఈ ఎఫ్‌సీఐ లేఅవుట్‌ను అభివృద్ధి చేశారు. అయితే, శ్రీధర్ రావు ఈ లేఅవుట్ ఉనికిని దెబ్బతీస్తున్నారని గతంలో ప్లాట్ యజమానులు హైడ్రా ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా, ప్రదేశాలను రక్షించేందుకు అధికారులు అప్పట్లో చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత ఈ వివాదం హైకోర్టుకు చేరగా, సదరు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని న్యాయస్థానం స్పష్టమైన స్టే ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ కోర్టు ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా శ్రీధర్ రావు భూమిని చదును చేయడం, పబ్లిక్ స్థలాలను ఆక్రమించి తవ్వకాలు జరపడం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా, సీఎంసీ, జోనల్, మరియు టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి లేఅవుట్‌ను పరిశీలించిన హైడ్రా కమిషనర్.. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని ఆయన ఉద్ఘాటించారు.

# సింగరేణిపై కేంద్రానికి సవతి ప్రేమ ఎందుకు?: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సింగరేణి సంస్థ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో బుధవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణికి తాడిచర్ల-2 కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా వాస్తవ విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ కోల్ బ్లాక్‌ను 2013లోనే అప్పటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి అధికారికంగా కేటాయించిందని, ఇప్పుడు కేంద్రం ఇచ్చింది కొత్త కేటాయింపు కాదని, కేవలం ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మైనింగ్ లీజుకు ఇచ్చిన ముందస్తు అనుమతి మాత్రమేనని ఆయన కుండబద్దలు కొట్టారు. గోదావరి బెల్ట్‌లోని కోల్ బ్లాక్‌లన్నీ సింగరేణికే దక్కాలని ఆయన డిమాండ్ చేశారు.2013 సెప్టెంబర్ 16న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ జారీ చేసిన అధికారిక లేఖను మీడియాకు చూపించిన భట్టి విక్రమార్క, నాటి కేటాయింపు వివరాలను వెల్లడించారు. సింగరేణి భవిష్యత్ అవసరాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా తదితర అంశాలను దృష్టిలో ఉంచుకునే అప్పట్లో ఈ బ్లాక్‌ను సంస్థకు అప్పగించారని గుర్తుచేశారు. ఈ కోల్ బ్లాక్ గిరిజన భూముల్లో ఉన్నందున కేవలం ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రమే మైనింగ్ హక్కు ఉంటుందని, ప్రైవేటు సంస్థలకు అవకాశం లేదని నాటి లేఖలో కేంద్రమే స్పష్టంగా పేర్కొందన్నారు. అలాంటప్పుడు 2022లో కోయగూడెం బ్లాక్-3, 2024లో సత్తుపల్లి బ్లాక్-3, ఆ తర్వాత మణుగూరు ప్రాంతంలోని బ్లాకులను వేలానికి పెట్టడం చట్టస్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. ఇప్పటికే సింగరేణికి కేటాయించిన బ్లాక్‌కు మైనింగ్ లీజును దాదాపు దశాబ్ద కాలం పాటు కేంద్రం పెండింగ్‌లో ఉంచడం వల్ల సంస్థకు వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లిందని, దీనికి కేంద్రానిదే బాధ్యత అని ఆయన ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరంతర పోరాటం వల్లే ఇప్పుడు మైనింగ్ లీజుకు అనుమతి లభించిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను కలిసి స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, కిషన్ రెడ్డిలను పలుమార్లు కలిసి ఆధారాలతో సహా వినతిపత్రాలు సమర్పించి తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చామన్నారు. కొత్తగా బ్లాక్ ఇచ్చామని ప్రజలను తప్పుదోవ పట్టించకుండా, ఇప్పటికే కేటాయించిన బ్లాక్‌కు పెండింగ్ లీజును మంజూరు చేశామని కేంద్రం చెబితే వాస్తవానికి దగ్గరగా ఉండేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి జీ2జీ పద్ధతిలో కేటాయింపులు చేయడం సాధ్యమేనని, కాబట్టి గోదావరి బెల్ట్‌లోని బ్లాకులను వేలానికి వేయకుండా చట్టబద్ధంగా సింగరేణికే అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కల్పించిన సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (సీపీఎస్‌యూ) హోదాను బీజేపీ ప్రభుత్వం తొలగించడం వల్లే పర్యావరణ, అటవీ అనుమతుల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ హోదాను పునరుద్ధరించాలని కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని దశలవారీగా చెల్లిస్తూ సంస్థను ఆర్థికంగా గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. సింగరేణి ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ఆయన ఉద్ఘాటించారు.



# వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు

## తాడిచెర్ల ఫేజ్-2 సింగరేణికి కేటాయింపు స్వాగతం

### మంథనిలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ శ్రేణులు





పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 08:

మంథని నియోజకవర్గంలోని తాడిచెర్ల ఫేజ్-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వం కేటాయించడాన్ని స్వాగతిస్తూ బుధవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ప్రతినిధుల బృందం చొరవతో ఈ కేటాయింపు సాధ్యమైందని పేర్కొంటూ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బోగోజు శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి మాట్లాడుతూ వేలం ప్రక్రియ లేకుండానే తాడిచెర్ల ఫేజ్-2 బొగ్గు బ్లాక్‌ను నేరుగా సింగరేణికి కేటాయించడం కేంద్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సింగరేణి సంస్థ బలోపేతం కావడంతో పాటు తెలంగాణ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది పడిందన్నారు.ఈ బొగ్గు బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉంటుందని తెలిపారు. 40 నుంచి 50 సంవత్సరాల పాటు గని కార్యకలాపాలు కొనసాగడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా రూ.64 వేల కోట్లకు పైగా ఆదాయ సృష్టి జరిగే అవకాశముందని, వేలం నిర్వహించకపోవడం వల్ల రూ.2,550 కోట్ల ఆక్షన్ ప్రీమియం ఆదా అయిందని, తెలంగాణ ప్రభుత్వానికి సుమారు రూ.16 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని నాయకులు వెల్లడించారు. ఈ నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి మంథని ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, రానున్న ఎన్నికల్లో మంథని నియోజకవర్గంలో బీజేపీ విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్ నాంపల్లి రమేష్, సీనియర్ నాయకుడు నారమల్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఉపాధ్యక్షులు బొల్లంపల్లి లక్ష్మణ్, దాసరి శ్రవణ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రేపాక శంకర్, పట్టణ కార్యదర్శి పార్వతి విష్ణు, కోశాధికారి ఒడ్నాల శ్రీనివాస్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జులై 10 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

### విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం : పీ.డీ.ఎస్.యూ.

అర్జున్ సమాచారం జులై 08 మంచిర్యాల ప్రతినిధి:

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. సికిందర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు జులై 10న కేజీ నుంచి పీజీ వరకు అన్ని విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో భోజనశాల బకాయిలను రద్దు చేయాలని, నర్సింగ్ విద్యార్థినులకు




ఉచిత వసతి సౌకర్యం కల్పించాలని, ఇంజినీరింగ్ విద్యలో విరాళాల పేరుతో వసూళ్లు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్, మనీతేజ, అనిల్, రాహుల్, వంశీ పాల్గొన్నారు.

## మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల నివాళులర్పణ



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 08:

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మంథనిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గోట్కారి కిషన్, గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ చంద్రు రాజమల్లు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు.రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్ సేవలు, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, అభయహస్తం పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలతో వైఎస్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. 2003లో చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారువైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తికావడంతో పాటు మంథని ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాసంస్థలు ఏర్పాటుకు శ్రీధర్ బాబు కృషి చేశారని నాయకులు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద మృతిపై దర్యాప్తు వేగవంతం చేయాలి

## సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 08:

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రబాబు కాలనీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన



వృద్ధురాలు ఎల్లపూల రమణమ్మ (65) ఘటనపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.స్థానికుల సమాచారంతో మృతురాలి కుమారుడు ఇంటికి చేరుకుని చూడగా, రమణమ్మ మంచంపై మృతి చెంది ఉండగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవికమ్మలు, సుమారు ఐదు తులాల బంగారు గాజులు కనిపించకపోవడంతో అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సంఘటన స్థలాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించి మృతురాలి కుమారుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఘటనపై ఎవరిపైనైనా అనుమానం ఉన్నా లేదా కీలక సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి నుంచి కేసు పురోగతిపై వివరాలు తెలుసుకున్న కమిషనర్, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అనుమానితులను గుర్తించి విచారించాలని, అన్ని ఆధారాలను సేకరించి ప్రత్యేక బృందంతో దర్యాప్తును వేగంగా పూర్తి చేసి నిందితులను త్వరితగతిన



పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు.

## నష్టపరిహారం చెల్లించే వరకు పనులు నిలిపివేయాలని మేడిపల్లి రైతుల ఆందోళన

### పూర్తి పరిహారం లేకుండా భూముల్లో పనులు చేపట్టడంపై నిరసన



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 8:

మేడిపల్లి గ్రామ రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారి వ్యవసాయ భూముల్లో జేసీబీతో పనులు చేపట్టడాన్ని రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. తమకు రావాల్సిన పూర్తి నష్టపరిహారం చెల్లించే వరకు ఎలాంటి పనులు కొనసాగనివ్వబోమని రైతులు స్పష్టం చేశారు.మా అనుమతి లేకుండా మా వ్యవసాయ భూముల్లో పనులు చేపట్టడం సరికాదని, పూర్తి నష్టపరిహారం చెల్లించకుండానే భూములను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల హక్కులను పరిరక్షిస్తూ, ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు పూర్తి నష్టపరిహారం అందించిన తర్వాతే పనులను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో కొండు లక్ష్మణ్, బాద్రపు శ్రీనివాస్, బాద్రపు కృష్ణమూర్తి, ఉనగొండ మధుకర్, మండల శంకర్, పనగంటి ప్రశాంత్, మండల శ్రీనివాస్, సాగర్ల తిరుపతి, ఎరుకల బక్కయ్య, భద్రపు రంగయ్య, బర్ల వెంకన్న, తిరుపతి రెడ్డి, తొట్ల మహేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి చిరునామా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి -- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకల్లో పాల్గొని ఘన నివాళులర్పించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 8:

మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా హైదరాబాద్ పంజాగుట్ట సిటీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగించిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి సేవలు దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని కొనియాడారు.వ్యవసాయం, విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, రైతుల కోసం ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలు ఆయన దూరదృష్టికి నిదర్శనాలని అన్నారు. ప్రజా సంక్షేమమే పాలనకు అసలైన లక్ష్యమని ఆచరణలో చూపించిన మహానేతగా వైఎస్ రాజశేఖర రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని చెప్పారు.అనంతరం నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేక్ కట్ చేసి, మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయడమే మహానేతకు నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొని మహానేతకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను స్మరించుకుంటూ సేవలను కొనియాడారు.



PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA




## ‘ఓజీ 2’పై థమన్ సాలిడ్ అప్డేట్.. సెప్టెంబర్‌లో పవన్ ఫ్యాన్స్‌కు భారీ సర్‌ప్రైజ్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ఓజీ 2’ గురించి సంగీత దర్శకుడు ఎస్. థమన్ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. దర్శకుడు సుజీత్ తెరకెక్కించనున్న ఈ సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, థమన్ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ‘ఓజీ’ గత ఏడాది దసరా సందర్భంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకుంది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, పవన్ కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ విజయంతోనే చిత్ర బృందం ఓజీ 2 ను అధికారికంగా ప్రకటించింది.





## దిశ ఘటన ప్రేరణతో ‘వ్యూ’

మహేశ్ కాంపెల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టీరియస్ సస్పెన్స్ థ్రిల్లర్ ‘వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ’. సత్య చౌదరి నిర్మాత. సోనియా నాయుడు, పూజారెడ్డి కథానాయికలు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. మిస్టీరియస్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మహిళాప్రధాన చిత్రంలో అద్భుతమైన సందేశం కూడా ఉంటుందని, తొలి ప్రయత్నంలోనే ఇద్దరు కథానాయికల్ని పరిచయం చేయడం ఆనందంగా ఉందని నిర్మాత సత్య చౌదరి అన్నారు. దిశ ఘటనతోపాటు కొన్ని వాస్తవ సంఘటనల నుంచి ప్రేరణ పొంది, ఈ కథ రాసుకున్నానని దర్శకుడు మహేశ్ కాంపెల్లి తెలిపారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోయిన్లు సోనియా నాయుడు, పూజారెడ్డి ఆనందం వెలిబుచ్చారు. ఇంకా అన్విథ్, సాగర్, సమీర్, రంగారావు చౌదరి, ముసా అలీఖాన్ కూడా మాట్లాడారు.

## బంజారా జీవితాలే ఇతివృత్తంగా

**150ఏండ్ల క్రితం నిజాం నవాబుల పాలనలో గోర్ బంజారాల జీవితాల్లో చోటుచేసుకున్న యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రం**

**‘గ్యానిధార్’. ‘ది లిబెరేటర్’ అనేది ఉపశీర్షిక. కేశు నందన్ దర్శకుడు. సోహన్‌లాల్ రాథోడ్, కేసుల బ్రదర్స్ నిర్మాతలు. తెలుగు, హిందీ, బంజారా భాషల్లో తెరకెక్కుతున్న ఈచిత్రం పోస్టర్, టీజర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది.**

నట, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి, రచయిత వి.విజయేంద్రప్రసాద్, దర్శకుడు వి.సముద్ర, సంజీవ్‌కుమార్ రాథోడ్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ప్రకృతి సంరక్షణ కోసం బంజారాలు చేసిన వీరోచిత పోరాటాలు, నవాబుల కాలంలో వారు ఎదుర్కొన్న కష్టనష్టాల నేపథ్యంలో సినిమా తెరకెక్కించామని దర్శకుడు కేశునందన్ తెలిపారు. జయసింగ్, సూర్య, సాంబయ్య తదితరులు కీలకపాత్రలు పోషించిన ఈచిత్రానికి కెమెరా: మహి మడియన్ ఎంఎం, విజయ్.జి, సంగీతం: కల్యాణ్ కీస్



## థియేటర్లు దద్దరిల్లేలా ఇంటర్వెల్ సీక్వెన్స్?

సినిమాకు ఇంటర్వెల్ బ్యాంగ్ చాలా కీలకం. ముఖ్యంగా కమర్షియల్ సినిమాకు సరైన ఇంటర్వెల్ పడితే, ఆడియన్‌కి సెకండాఫ్‌పై అమాంతం హైప్ పెరిగిపోతుంది. అదే లక్ష్యంతో ఇప్పుడు ‘ఫౌజీ’ సినిమా ఇంటర్వెల్ బ్యాంగ్‌ని ప్లాన్ చేశారు దర్శకుడు హను రాఘవపూడి. ఈ నెల 10 నుంచి హైదరాబాద్ శివార్లలో వేసిన ‘ఆచార్య’ సెట్‌లో ‘ఫౌజీ’లోని అత్యంత కీలకమైన ఇంటర్వెల్ సీక్వెన్స్‌ని చిత్రీకరించబోతున్నారు. సినిమా మొత్తానికీ టర్నింగ్ పాయింట్‌లా ఈ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. మరో విషయం ఏంటంటే.. ఈ ఎపిసోడ్ కోసం ముందు కొన్నిరోజులు యూనిట్‌తో రిహార్సల్స్ చేయించినట్టు వినికిడి.కెమెరా యాంగిల్, ఫైట్ మూమెంట్, డైలాగ్ మూమెంట్, టోటల్ షాట్.. ఇలా ప్రతి విషయంపై క్షుణ్ణంగా ప్రాక్టీస్ చేయించి, పక్కాగా ఫైనల్ అయ్యాకే, సంతృప్తిగా రేపు సెట్‌కి వెళ్తున్నారట. ఒక్క ఎపిసోడ్ కోసం టీమ్ ఇంత కష్టపడుతున్నదంటే ఈ సీక్వెన్స్ ప్రాధాన్యత ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఎపిసోడ్‌లో ప్రభాస్‌కి ఇచ్చే ఎలివేషన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో రూపొందుతున్న ఈ సీక్వెన్స్ సినిమాకే హైలైట్ కానున్నదని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు



## అనుభూతినిచ్చే రాజా ది రాజా

రుత్విక్, విశాఖ దీమన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ డ్రామా ‘రాజా ది రాజా’. అనిల్ బోయిడపు దర్శకుడు. కె.నిహారిక దాసరి నిర్మాత. జూలై 17న సినిమా విడుదల కానున్నది. మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నది. హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. పునర్జన్మ, ప్రేమ, భావోద్వేగాల కలగలుపుగా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టు ట్రైలర్ చెబుతున్నది ఈ సినిమా విడుదల చేస్తుండటం పట్ల మైత్రీ అధినేతలు ఆనందం వెలిబుచ్చారు. గొప్ప అనుభూతినిచ్చే సినిమా ఇదని, సాంకేతకంగానూ ఆకట్టుకుంటుందని హీరో రుత్విక్ నమ్మకంగా చెప్పారు. అందర్నీ అలరించే అద్భుతమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని నిర్మాత నిహారిక అన్నారు. హీరో రుత్విక్ ఒదిగిపోయి నటించాడని, టీమ్ సహకారం వల్లే సినిమా బాగా వచ్చిందని దర్శకుడు అనిల్ బోయిడపు అన్నారు.



